## క్లుప్తంగా

### ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో స్టాక్ పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు, తదితరులు

రాజాం: పట్టణంలోని ఆంజనేయ ట్రేడర్స్ ఎరువుల దుకాణంతో పాటు పొనుగుటి వలసలోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయశాఖ విజిలెన్స్ సీఐ టి.అప్పలనాయుడు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల వివరాలు, స్టాక్ బ్యాలెన్స్ రికార్డులను పరిశీలించారు.ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించవద్దని, అలా ఎవరైనా విక్రయిస్తే లైసెన్స్ రద్దుచేస్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. అన్నీ సక్రమంగా ఉన్నట్టు విలేకరులకు తెలిపారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.చంద్రరావు, మండల ఏఓ చీకటి రఘునాథ్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### హిందీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు పెంపు

రాజాం: దక్షిణభారత హిందీ ప్రచార సభ (చెన్నై)కు చెందిన హిందీ పరీక్షల ఫీజులు చెల్లించేందుకు ఈనెల 25 వరకు గడువు పెంచారని రాజాంకు చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, ప్రవేశిక, రాష్ట్రభాష, విశారద, ప్రవీణ పరీక్షలకు సంబంధించి పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈ గడువులోగా ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99499 17365 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

బొబ్బిలిరూరల్: పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం స్కూల్ సమయం ముగిసిన తర్వాత అదనంగా మరో గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ మాణిక్యంనాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. పారాది గ్రామంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, మధ్యాహ్న భోజనాల నాణ్యత,తాగునీటిని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి, వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

### విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అసిరినాయుడు

రేగిడి: మండలంలోని దేవుదల గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) లో చదువుతున్న విద్యార్థినులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు మంగళవారం వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థినులకు కాచి చల్లార్చిన నీటిని, వేడివేడి ఆహారపదార్థాలను అందివ్వాలని కేజీబీవీ ఎస్‌ఓ లక్ష్మికి చెప్పారు. వైద్య సిబ్బంది అప్పారావు, సాహు, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల విభజనపై సమ్మతి తెలపాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన ఆర్డీఓ

బొబ్బిలి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్‌బూత్‌లలో 1,200 మంది ఓటర్లకు మించి ఉన్న వాటిని విభజించాలని, దీనికి తగ్గట్టు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సమ్మతిని కూడా తెలియజేయాల్సి ఉంటుందని ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్.రామమోహనరావు అన్నారు. ఈఅంశాలపై మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివి ధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల సంఘం ఆదేశాలు, సూచనలు తెలియజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో 12,00 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు 26 ఉన్నట్టు గుర్తించామని ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి రామమోహనరావు తెలిపారు.తహసీల్దార్ ఎం.శ్రీను, డీటీ బలివాడ గౌరీశంకరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువు..దరువు

- రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా కాని ఎరువులు
- అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేటు దుకాణదారులు



రాజాంలోని ఓ ఎరువుల షాపులో రైతుల రద్దీ



అధిక ధరలు చెల్లించి యూరియా తీసుకు వెళుతున్న రైతులు

రాజాం: కూటమి ప్రభుత్వ తీరు, అధికారుల అలసత్వం కారణంగా మండల రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ కాకపోవడంతో గత్యంతరం లేక రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఖరీఫ్ మొక్కజొన్న, తదితర పంటలకు ఎరువులు వేసేందుకు అదును కావడంతో ఎరువుల దుకాణాల వద్ద రైతులు క్యూకడుతున్నారు. ఇదే అదునుగా కొంతమంది ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఓ ఎరువుల దుకాణంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మంగళవారం రెండు లారీలతో యూరియా ఎరువు వచ్చింది. వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు షాపు వద్ద ఎగబడ్డారు. యూరియా కావాల్సిన రైతులు రెండు బస్తాలు తీసు



యూరియా కోసం ఎరువుల దుకాణం వద్ద క్యూలో ఉన్న రైతులు

కోవాలని, అదనంగా ఒక గుళికల ప్యాకెట్ కొంటేనే యూరియా ఎరువు ఇస్తామని షాపు యజమాని ఆంక్షలు విధించినట్లు రైతులు వాపోయారు. చేసేదిలేక పలువురు రైతులు రెండు యూరియా బస్తాలను రూ. 680లకు కొనుగోలు చేయడంతో పాటు అదనంగా రూ. 450లు చెల్లించి గుళికల మందును కొనుగోలు చేశారు. వాస్తవంగా యూరియా ఎరువు బస్తాను రూ. 280కు మాత్రమే విక్రయించాల్సి ఉండగా, రూ. 60 అదనంగా విక్రయిస్తున్నారు. వీటికి తోడు రైతుకు అవసరం లేని గుళికలు మందును అంటగట్టడంతో రైతులు మండిపడ్డారు. ప్రభుత్వ తీరును, అధికారుల అలసత్వాన్ని బాహాటంగానే విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు సరసమైన ధరలకు, సకాలంలో అందేవని గుర్తు చేసుకుంటూ.. ఇప్పుడు అధిక ధరలతో పాటు రవాణా ఖర్చులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పలుచోట్ల సకాలంలో యూరియా ఎరువులు వేయక మొక్కజొన్న పంట దెబ్బతిందని, వరి నారుమడులు పూర్తిగా పాడయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలకు యూరియా ఎరువులు విక్రయించడంపై ఉన్నతాధికారులకు కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారు.

### అన్నదాతల అవస్థలు



భీమవరంలో తెరచుకోని రైతు సేవా కేంద్రం

బాడంగి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ కాకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడాల్సి వస్తోంది. రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సాగు సంబంధిత సలహాలు, సూచనలు అందించేందుకు గత వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది. మండలంలో 17 ఆర్బీకేలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే)గా మార్చింది. ప్రభుత్వం పేరు మార్చడంలో చూపించిన శ్రద్ధ ఆర్‌ఎస్‌కేల ద్వారా సేవలం దించడంలో చూపించడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. మండలంలో 17 ఆర్‌ఎస్‌కేలు ఉంటే ఏడు కేంద్రాలకు మాత్రమే యూరియా, డీఏపీ ఎరువును అరకొరగా సరఫరా చేశారు. దీంతో ఆ కేంద్రాల సిబ్బంది వాటిని ఎవరికివ్వాలో తెలియక పంపిణీ చేయలేదు. రైతులు ఇక చేసేది లేక ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎరువులకు అధిక ధరలు చెల్లించడంతో పాటు రవాణా ఛార్జీల భారంతో రైతుల జేబులు గుల్లవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి నెల న్నర కావస్తున్నప్పటికీ ఆర్‌ఎస్‌కేల్లో ప్రభుత్వం ఎరువులు అందుబాటులో ఉంచకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. ఆర్‌ఎస్‌కేల ద్వారా ఎరువులు అందకపోవడాన్ని పక్కన పెడితే వారం రోజులుగా అసలు ఆ కేంద్రాలే తెరచుకోవడం లేదు. అక్కడ పనిచేసే గ్రామ వ్యవసాయ సహాయకులకు( వీఏఏలు)బదిలీలు కావడంతో వారికి ఇంకా రిలీవింగ్ ఆర్డర్లు అందకపోవడం, వారి స్థానంలో కొత్తవారు జాయినింగ్ కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. సమస్యను ఏఓ.సూర్యప్రకాష్ వద్ద సాక్షి ప్రస్తావించగా సిబ్బంది బదిలీల కారణంగా ఆర్‌ఎస్‌కేలలో సరిపడా ఎరువుల నిల్వలను సిద్ధం చేయలేకపోయామని చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో అన్ని ఆర్‌ఎస్‌కేలకు ఎరువులు వస్తాయని చెప్పారు.

## బాధితులకు పరామర్శ



రిమ్స్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణంలోని బుచ్చింపేట గ్రామంలో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ముద్దాడ రాము, పిట్టా రాము, పిట్టా సత్యంకు గాయాలు కాగా, వీరు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.వీరిని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స, వారి పరిస్థితిపై అక్కడి వైద్యులను డాక్టర్ రాజేష్ ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అక్కడి నుంచి రాజాం పోలీసులకు ఫోన్ చేసి కొట్లాటలో గాయపడిన బాధితులకు న్యాయం చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పరామర్శించిన వారిలో రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు దూబ గోపాలం, గోకవలస బాబూరావు, పార్టీ జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు వేగుచుక్క హేమంత్, పిట్టా జగదీష్, కోరాడ రామినాయుడు, ముద్దాడ నాగరాజు, నమ్మి అసిరినాయుడు, తదితరులు ఉన్నారు.

### మధ్యవర్తిత్వంపై అవగాహన



కేసుల రాజీకి సంబంధించి మధ్యవర్తిత్వంపై రాజాం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు సముదాయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. మధ్యవర్తిత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను న్యాయ వాదులు ప్రజలకు వివరించారు. వివాహానికి సంబంధించిన కేసులు, గృహహింస, చెక్‌బౌన్స్, సివిల్, రాజీకీ అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించనున్నట్లు చెప్పారు.ఇందుకోసం శిక్షణ పొందిన న్యాయవాదులు మధ్యవర్తిత్వం చేయనున్నట్లు స్పష్టం చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ సభ్యులు బి.అప్పలనాయుడు, వైఎస్.శ్రీనివాస్, ఆర్.ఈ.సి.హెచ్. జయదేవ్, ఏ.సత్యనారాయణ, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్, రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల పోలీసు సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. – రాజాం సిటీ

### అనుమతితోనే ఆక్రమణలు..!



బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి వెళ్లే రోడ్డులో ప్రసాదరావునగర్ సమీపంలో రోడ్డు అంచునే ఆక్రమణలు జరుగుతున్నాయి. మున్సిపల్ స్థలంలో సొంతంగా షాపులు నిర్మించేస్తున్నారు. పట్టణంలో యథేచ్ఛగా ఆక్రమ ణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి దుకాణం నిర్మిస్తున్న ఓ వ్యక్తిని సాక్షి ప్రశ్నించగా తనకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారని, తాత్కాలికంగా నిర్మించుకోమని చెప్పారనడం కొసమెరుపు. ఇదే బాటలో ఒకరి తర్వాత మరొకరు ఆక్రమించు కుంటూ నిర్మాణాలు సాగిస్తున్నారు. కాలువలపైన, రోడ్ల అంచుల్లో ఏమాత్రం ఖాళీ ఉన్నా సరే రోడ్డు పైకి వచ్చే లా దుకాణాలు నిర్మించేస్తున్నారు. ఈవిషయంలో కూటమి నాయకులు అక్రమార్కులకు ఒకరి తర్వాత మరొ కరు నిర్మించుకోండని ఉచిత సలహా ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అక్రమార్కులు కూడా అదే వరుస ఫాలో అవుతున్నారని పట్టణంలో టాక్ నడుస్తోంది. – బొబ్బిలి

## దివ్యాంగుల అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న అంబుడ్స్‌పర్సన్,సీడీసీ పీడీ అన్నపూర్ణ

రామభద్రపురం: దివ్యాంగుల అభివృద్ధికి రెహా స్విస్ సంస్థ, సీడీసీ అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుందని పీఆర్అండ్ ఆర్డీ శాఖ అంబుడ్స్‌పర్సన్, సీడీసీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.అన్నపూర్ణ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి.గోపాల నాయుడుతో కలిసి దివ్యాంగ సంఘాల సభ్యులకు రెహా స్విస్ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎంత శాతం అంగవైకల్యం ఉంటే పథకాలకు అర్హులో తెలుసు కోవాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వాలు, వివిధ సంస్థలు అందించే జీవనోపాధి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని సూచించారు. అర్హులకు పథకాలు అందకపోతే సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సీడీసీ సభ్యులు బి.శంకరరావు,డి.రవికుమార్,త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతగా పనిచేయాలి



బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులతో ఎంపీపీ లక్ష్మణరావు,ఎంపీడీఓ రత్నం

రామభద్రపురం: మండలం నుంచి బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులు ఎక్కడైనా సరే ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. సాధారణ బదిలీలు అనంతరం మండలంలోని సచివాలయాల నుంచి బదిలీ అయిన ఉద్యోగులకు రిలీవింగ్ ఆర్డర్స్‌ను ఎంపీడీఓ రత్నం, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు మంగళవారం ఇచ్చారు.కార్యక్రమంలో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

### అధికారులతో సమావేశం

బొబ్బిలి: నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఈఈ త్రిమూర్తులు, ఇతర అధికారులతో ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీ నాయన) పట్టణంలోని తన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యే వారితో చర్చించారు. ప్రస్తుతం ప్రతిపాదనల దశలో ఉన్న స్కీమ్‌ల గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



తెర్లాం:కూనాయవలసలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్: పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ అన్నారు. అలజంగి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. నారుమడుల తయారీ విధానం, మొక్కజొన్న, చెరకు, తదితర పంటలకు సోకే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. నత్రజని,నానోయూరియా,నానో డీఏపీ వంటి ద్రవ రూప ఎరువులను పంటలకు ఏవిధంగా పిచికారీ చేయాలో వివరించారు.వీఏఏ పెంటలత, తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి**

తెర్లాం: ఖరీఫ్ వరి నారుమడులకు అవసరమైన సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని ఏఓ బి.శ్రీనివాసరావు రైతులకు సూచించా రు.కూనాయవలస గ్రామం లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వరినారు మడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వారి సందేహా లను నివృత్తి చేశారు.అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరిపంట సాగులో ప్రధానమైనది వరి నారును కాపాడుకోవడమేనని చెప్పారు.నారు చివరలు తుంచి నాట్లు వేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. సర్పంచ్ బోడెల విజయబాబు, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి కర్రి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మధు, ఏఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.

# రాజాంలో ఆక్రమణల జోరు!

- కోర్టు తీర్పును కాదని బలవంతంగా నిర్మాణాలు
- లబోదిబోమంటున్న బాధితులు



తన స్థలం ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్న సూర్యనారాయణ



వివాదంలో ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు

రాజాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజాంలో ఆక్రమణలు జోరందుకున్నాయి. అధికార బలంతో దేవదాయశాఖ, ప్రభుత్వ ఆస్తులతో పాటు సాధారణ రైతుల భూములను కబ్జాచేస్తున్నారు. ఆవేదనకు గురిచేస్తున్నారు. రాజాం పట్టణ పరిధిలోని మల్లికార్జున కాలనీలో కోడిబోయిన సూర్యనారాయణ అనే సన్నకారు రైతుకు చెందిన జిరాయితీ భూమిని ఓ టీడీపీ కార్యకర్త బలవంతంగా ఆక్రమించి నిర్మాణాలు చేయడం ఇప్పుడు రాజాంలో చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాలు ఉన్నా న్యాయం జరుగడంలేదంటూ రైతు కుటుంబం లబోదిబోమంటోంది. వివరాల్లోకి వెళ్తే...

రాజాం పట్టణం మల్లికార్జునకాలనీకి చెందిన కోడిబోయిన సూర్యనారాయణ, కోడిబోయిన శివకు అదే కాలనీలో సర్వేనంబర్ 192/1, 2, 3, 4, 5లో ఎకరా భూమి వంశపారంపర్యంగా దక్కింది. ఈ ఆస్తిపై హక్కుల కోసం కోర్టుకెక్కి లోక్ అదాలత్‌లో రాజీపడ్డారు. అనంతరం తనకు దక్కిన ఎకరాలో 56 సెంట్లు భూమిని సూర్యనారాయణ పలువురికి విక్రయించి, మిగిలిన భూమి తన వద్ద ఉంచుకున్నాడు. ఈ భూమితో పాటు గతంలో పలువురికి విక్రయించిన భూమిపై టీడీపీ కార్యకర్తల కన్నుపడింది. ఆక్రమణలకు తెరతీశారు. బెదిరించి నిర్మాణాలు తలపెడుతన్నారు. 100కు ఫోన్ చేయడంతో పాటు రాజాం పట్టణ సీఐ అశోక్‌కుమార్‌ను సంప్రదించినా న్యాయం చేయలేదని, ఆక్రమణలకు అడ్డుకట్టపడలేదంటూ సూర్యనారాయణ స్థానిక విలేకరుల వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులే దగ్గరుండి ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. తమ భూమిలో అక్రమ నిర్మాణాలపై అటు రెవెన్యూ అధికారులతో పాటు ఇటు చీపురుపల్లి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుచేసినట్టు తెలిపారు.

### మేం ఎవరికీ మద్దతు ఇవ్వడంలేదు

మల్లికార్జునకాలనీలో భూ వివాదం మాదృష్టికి వచ్చింది. కోర్టు ఆదేశాలు సూర్యనారాయణను ఇంటిని నిర్మించుకోమని లేవు. రెండో వర్గానికి కూడా ఎటువంటి ఆదేశాలు లేవు. ఇరు వర్గాలు గొడవలు పడవద్దని చెప్పాం. ఏ ఒక్కరికీ మేం వత్తాసు పలకడం లేదు. కోర్టు నుంచి నిర్మాణాలు చేయవద్దని ఆదేశాలు తెచ్చుకోమని సూర్యనారాయణకు చెప్పాం.

– కె.అశోక్‌కుమార్, రాజాం పట్టణ సీఐ

### మాదకద్రవ్యాల జోలికిపోవద్దు

రాజాం సిటీ: ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, యువత, విద్యార్థులు, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. గడిముడిదాం గ్రామంలో మంగళవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, సైబర్ నేరాలు, చట్టాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలంతా స్నేహపూర్వకంగా ఉంటూ శాంతియుత వాతావరణంలో మెలగాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, పొగాకు సంబంధిత ఉత్పత్తులైన సిగరెట్లు, చుట్టలు, ఖైనీ, గుట్కా వంటి వాటికి అలవాటు పడవద్దని అన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు తెలియజేయాలని సూచించారు.

### కేంద్ర బృందం పర్యటన

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీలో నేషనల్ లెవెల్ మోనటరింగ్ (ఎన్ఎల్ఎం)సభ్యులు,రీసెర్చ్ ప్రొఫెసర్ సునీల్‌బంటా,నాతూసింగ్ మంగళవారం పర్యటించారు.ఉపాధి హామీ నిధులతో చేపట్టిన తాగునీటిట్యాంకుల నిర్మాణ పనులు, ఉద్యానవన మొక్కల పెంపకాన్ని పరిశీలించారు.అనంతరం సచివాలయంలో గ్రామభ నిర్వహించి పొదుపు సంఘాల లావాదేవీలను పరిశీలించారు. హౌసింగ్,పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేంద్ర బృంద సభ్యుల వెంట ఎంపీడీఓ రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## సంక్షిప్తంగా...

**26, 27వ తేదీల్లో సీపీఐ మహాసభలు**

రాజాం సిటీ: ఈనెల 26, 27 తేదీల్లో బొబ్బిలిలో నిర్వహించనున్న సీపీఐ 14వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. పట్టణంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాటాలు నిర్వహించడానికి ఈ సభలు వేదిక కానున్నాయని చెప్పారు. సభ లకు ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ రాజాం నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, సహాయ కార్యదర్శి కనకరాజు, గంగరాజు, జామి అప్పారావు, సన్యాసినాయుడు తదిరులు పాల్గొన్నారు.

**నాణ్యత పాటించాలి**

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే రాగిజావలో నాణ్యత పాటించాలని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. కొరటాం పాఠశాల ను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను పరిశీలించారు.రోజూ తప్పనిసరిగా విద్యార్థులకు చిక్కటి, రుచికరంగా ఉన్న రాగిజావ ఇవ్వాలని, అలాగే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.

**తాగునీటి వనరుల పరిశీలన**

రాజాం/వంగర: రాజాం మండలంలోని గురవాం, కంచరాం తదితర గ్రామాల్లో, వంగర మండల పరిధి తలగాం గ్రామంలో తాగునీటి వనరు లను ఆయా మండలాల ఎంపీడీఓలు వావిలపల్లి శ్రీనివాసరావు, ఎస్.రఘునాథాచారి మంగళవారం పరిశీలించారు. బోర్ల నుంచి నీటి శాంపి ల్స్ సేకరించి నాణ్యత పరీక్షించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించారు. తాగునీరు కలుషితం కాకుండా నిత్యం క్లోరినేషన్ చేయి స్తుండాలని, ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓలు ఆదేశించారు.

**ఓటర్ల నమోదును సక్రమంగా చేయాలి**

బొబ్బిలిరూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. కొత్త ఓటర్ల చేర్పులు, సవరణ లు, తొలగింపులకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు.ఎలక్షన్ డీటీ బలివాడ గౌరీశంకర్ పాల్గొన్నారు.

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

వంగర: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్, వ్యవసాయశాఖ ఏడీఏలు ఎం.రామారావు, పి.అప్పలనాయుడు ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. అరసాడ గ్రామంలోని మూడు ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేశారు. రికార్డుల నిర్వహణ, క్రయవిక్రయాల రశీదులను పరిశీలించారు. ధ్రువపత్రాలు సరిగాలేని రూ. 4,12,119 విలువగల పురుగుమందులను విక్రయాలు జరపవద్దని ఆదేశించారు.